# వెండితెర వెనుక
## సత్తిబాబు



గత ౩౫ సంవత్సరాలుగా తెలుగు సినీరంగంలో దర్శకత్వశాఖలో విశేషమైన అనుభవం ఉన్న రచయిత కలం నుంచీ

౧౯౭౮ ప్రాంతాల్లో మద్రాసులోని తెలుగు చలనచిత్ర రంగానికి అద్దం పట్టే ధారావాహిక నవల.

(గతసంచిక తరువాయి..)

8

"నేను మద్రాసు వచ్చినపుడు చేతి సంచితో వచ్చాను! నన్నెవరూ మోసం చెయ్యలేదే!"..

"మీరు ఆర్టిస్ట్‌గా వచ్చుంటే తెలుసుండేది"

"మీ ఎస్టిమేషన్ ప్రకారం సినిమా ఇండస్ట్రీ అంతా మోసం! అటువంటప్పుడు ఖచ్చితంగా నేను కూడా మోసపోవాలి, ఇండస్ట్రీలో నేనూ ఒక భాగం కనక"

"గవర్నమెంటులో లంచాలొచ్చే డిపార్టుమెంట్లు కొన్ని ఉన్నట్టే... ఇక్కడ కూడా మోసపోయేవాళ్ళు కొందరే అని చెప్పడానికి నేను చింతిస్తున్నాను రంగబాబుగారూ!"

"అప్పుడే చింతించొద్దు గగన్ కుమార్‌గారూ! ఎవరు చీప్ పబ్లిసిటీ మీద పైకొచ్చారు, ఎవరు డబ్బు పెట్టి పైకొచ్చారు, ఎవరు బాక్‌గ్రౌండ్ మీద పైకొచ్చారూ... వీళ్ళలో ఎవరెవరు టాలెంట్ లేకుండా పైకొచ్చి, ఎన్నేన్నాళ్ళు ఉన్నారు. బేరీజు వేసుకుని, తర్వాత చింతించండి."

గగన్‌కుమార్ ఏదో ఆలోచిస్తూ కొంచెం తాగాడు. నేనూ వేసుకున్నాను. నిషా బాగానే ఎక్కింది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అన్నాను, "లాజికల్‌గా నా పాయింట్స్ కరెక్టని ఒప్పించగలనేమో కానీ... మీరు పడ్డ బాధల్ని తప్పని ఒప్పించలేను. ప్రస్తుతం నేను మనఃశ్శాంతి కలిగించలేనేమో ఇక ముందైనా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే మంచిది."

"ఇక తీసుకునే నిర్ణయాలు ఏమున్నాయి! ఇప్పటికే దిగజారిపోయాను. ఈ పరిస్థితుల్లో ఇంకో అడుగువేసే సాహసం కూడా లేదు.. ఊళ్ళో అందరూ హీరో... హీరో అని మునగ చెట్టు ఎక్కిస్తే నిజమేననుకుని, అమ్మా - నాన్నలతో పోట్లాడి, ముప్పైవేలు తీసుకుని, అందమైన కలలు కంటూ ఇక్కడ దిగాను సార్! ఆ డబ్బు అయిపోయేవరకూ నా కలలు అందంగానే ఉన్నాయి. అక్కడి కంటే ఎక్కువగా ఇక్కడా చెట్లు ఎక్కించేవాళ్ళు తగిలారు! ఆఖరి పైసా అయేవరకూ అందరూ చుట్టూ ఉన్నారు. క్రిందటి వారం, డబ్బుకోసం

ఆత్మాభిమానం చంపుకుని ఇంటికి ఉత్తరం రాసాను. 'తనమాటకాదని, కాలేజీ ఎగ్గొట్టి వచ్చినందుకు - నా ముఖం చూడనని, తనకీ - నాకూ ఏ సంబంధం లేదనీ' నాన్న ఉత్తరం రాసారు. ఈ విషయం తెలిసిన తర్వాత చుట్టూ ఉన్నవాళ్ళు, ఒక్కొక్కరూ పారిపోయారు! నా డబ్బు తిన్నవాళ్ళలో ఒక్కడు కూడా పైసా సాయం చెయ్యడానికి, ముందుకు రాకపోగా... 'కొవ్వెక్కి డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టుకున్నాడు, వాడి ముఖం వాడు, అద్దంలో చూసుకోకుండా సర్కారెక్కి వచ్చాడు. పాపం' అని కామెంట్లు మొదలుపెట్టారు. నేను చాలా ఆశ్చర్యపోయాను! ఏం లాభం... ఇప్పుడు నేను చేయగలిగింది ఏమీ లేదు.....మనసులో బాధ చెప్పుకుందామన్నా, ఒక్క స్నేహితుడు లేడు! పనిలేదు...ఒంటరితనం! ఈ బాధ భరించలేకపోతున్నాను సార్! చక్కని ఫామిలీని, ఫ్రెండ్స్‌ని విడిచిపెట్టి వచ్చి, ఏకాకినైపోయాను. అటు పోలేను. ఇక్కడ ఉండలేను. జీవితం చేతులారా నాశనం చేసుకున్నాను సార్!"....

ఆని మోకాళ్ళలో తలపెట్టుకుని.... కూర్చుండిపోయాడు! నా మనసంతా జాలితో నిండిపోయింది. నేను మాత్రం ఏం చేయగలను!

"ఊరుకోండి గగన్‌కుమార్‌బాధపడకండి" అని భుజం మీద చెయ్యివేసాను.

గగన్‌కుమార్ తలెత్తి, చిన్నగా నవ్వి, "ఏడుస్తున్నాననుకున్నరా సార్! ప్రస్తుతం ఏడ్చే ఓపిక్కూడా లేదు. మీ దగ్గర అన్నీ చెప్పేసాక మనసు చాలా తేలిక పడింది. ... ఇంత సేపు బోర్ కొట్టించాను కదు!"

'నొ, నో. నాకేం బోర్ లేదు పైగా నాకూ పనిలేదు" అన్నను.

"ఉంటాను సార్"

"ఓకే, అప్పుడప్పుడూ వస్తూవుండండి"

"థాంక్యూ సర్! గుడ్‌నైట్"

"గుడ్‌నైట్"

తడబడుతూ మెట్లు దిగి వెళ్ళిపోయాడు గగన్ కుమార్. గాలికి ఎంగిలాకులు రెపరెపలాడుతున్నాయి. ఖాళీగ్లాసులు, ఖాళీసీసాలు, సిగరెట్టు ముక్కలు - చిందర వందరగా పడిఉన్నాయి. రూము శుభ్రం చెయ్యాలని పించలేదు. మత్తు మెల్లిగా ఎక్కుతోంది. చాపమీద పరుపు పరచి పడుకున్నాను. మత్తుగా ఉంది కానీ, నిద్రపట్టటం లెదు. వంటినిండా వేడి సెగలు కక్కుతుంది. నరాలు జివ్వుమంటున్నాయి. ఎవరన్నా అమ్మాయి దగ్గరకు వెడితే బావుండు. ఆలోచన రాగానే, తటాలున లేచి బట్టలు వేసుకుని, రూమ్‌లాక్ చేసి రోడ్డు మీద పడ్డాను! అడుగులు విపరీతంగా తడబడుతున్నాయి. థియేటర్ దగ్గరకొచ్చి ఆటో ఎక్కి రజని ఇంటి ముందు దిగాను. లోపల ఎర్రబల్బ్ వెలుగుతుంది. తలుపు తట్టి, గోడకు ఆనుకుని నిలబడ్డాను. అయిదు నిమిషాల తరువాత తలుపు తెరచుకుని, వళ్ళు విరుచుకుంటూ రజని బయటకొచ్చింది.

"ఎవరూ"

........

"ఏవరం.... అరే మీరా రంగ బాబుగారూ!నమస్కారం సార్"

"న...మ...స్తే"

"లోపలికి రండి" అంటూ బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళి మంచం మీద కూర్చోబెట్టి, పక్కనే తనూ కూర్చుని, "దారి తప్పి వచ్చారు" అంది.

"దారి తెలిసే వచ్చాను"

నవ్వి "ఇంతకుముందు, ఎన్ని సార్లు పిలిచినా రాలేదు. ఈరోజు పిలవకుండానే వచ్చారు. మా అదృష్టమా, దురదృష్టమా"

"నా ఖర్మ"

"అయ్యో పాపం! ఇంతకీ, ఇక్కడికి రావడంలో విశేషం ఏమిటి?"

"ఒక అబ్బాయి - ఒక అమ్మాయి దగ్గరకు, అందులో నీ దగ్గరకు ఇంత రాత్రి ఎందుకొస్తాడు"

"అందుకొచ్చారా! సరే నే పిలిచినపుడు మీరు రాలేదు కదూ!"

"అవును"

"ఇప్పుడు మీకై మీరే వచ్చారుగా"

"నిజమే"

"అందుకని, ఈ రాత్రి మీతో ఉన్నందుకు రెండొండొందలు! అదీ మీకు గనక కన్సెషన్"

"అయితే వస్తాను" అని లేచాను.

"అదేంటి సార్"

"ఇప్పటికే సగం రాత్రి గడిచిపోయింది! సగం రాత్రికి రెండొందలా !"

"సరే రెండొందల్ని సగం చేసి, వందివ్వండి"

"అలాగే! ఆ వందకూడా ఇప్పుడివ్వను! ఒక ఐడియా చెబుతా నువ్వే కలెక్ట్ చేసుకో"

"చెప్పండి."

"పాతవేలు రామయ్యగారు, పాత పిక్చర్లో నాకు రెండు వేలు బాలన్సు ఇవ్వాలి అది వసూలు చేసుకో"

"భలే కాతా చెప్పారు సార్!" ఆ పిక్చర్లో వేషం వేసినందుకు నాకూ ఆయన ఇవ్వాలి.

"అదే! నా ఎమౌంట్ - నీ ఎమౌంట్ రెండూ వసూలు చేసుకో! రెండు వేలిచ్చినా, రెండూ వందలిచ్చినా, రెండు రూపాయలిచ్చినా, మొత్తం నీదే"

"ఆయనివ్వటం అటుంచి, మన్ని అడక్కుండా ఉంటే అంతే చాలు ఆయనొకసారి నన్ను హోటల్ రూమ్‌కి తీసుకెళ్ళి, రాత్రంతా ఉంచుకుని ఇంకా ఇద్దరు ఫ్రెండ్స్ రూమ్స్‌కి పంపి, ఉదయాన ఆటో డబ్బులు కూడా ఇవ్వకుండా పంపారు. అఫ్‌కోర్స్ - వేషం ఇచ్చారనుకోండి."

"గుడ్"

"ఏమిటి గుడ్డు!"

"ఆ పిక్చర్‌లో నీ డొనేషన్ కూడా ఉందన్నమాట"

రజని చిలిపిగా నవ్వి, "ఇలాగే కూర్చుని కబుర్లు చెబుతారా"

"నువ్వు రేటింకా ఫిక్స్ చేయలేదు"

"నా రేటు హీరోయిన్ కేరెక్టర్‌తో సమానం , అంతే ఇస్తారా!"

"నా పిక్చర్‌లో హీరోయిన్‌కి నువ్ సూటబుల్ అనుకుంటే - తప్పకుండా ఇస్తాను."

మందు బాగానే కొట్టారనుకుంటానే"

"అందుకనే నీ దగ్గరకొచ్చాను"

"లేకపోతే రారా"

"రాను"

"ఏం...పాపం"

..............

"ఎవరైనా ప్రేమించిన అమ్మాయుందా!"

"ఊc..."

"ఆ అమ్మాయి మిమ్మల్ని రానివ్వడం లేదా!"

"అదేం కాదు"

"చెప్పండి బాబూ!" గోముగా అని గుండెలమీంచి లేచింది.

"ఏవుంది చెప్పడానికి"

"జాకెట్టు తీస్తే నేను బావున్నానా... ఆc.. అమ్మాయా!"

"ఛ! అంత ఛండాలంగా మాట్లాడకు"

"ఏc... సార్! ప్రేమిచుకున్నోళ్ళు ముందు చేసే పనేగా ఇది."

"ఆ అమ్మాయిని అలా ఊహించుకోవడం లేదు"

"పెళ్ళయిన తర్వాత కూడా..."

"ప్రస్తుతం పెళ్ళి కాలేదుగా"

...............

...............

"మీరు చాలా మంచి వాళ్ళు"

"అలాగా"

"అవును! మిమ్మల్ని ప్రేమించిన అమ్మాయి చాలా అదృష్టవంతురాలు"

"ఎందుకో"

"ఆ అమ్మాయిని మీరు కల్లో కూడా మోసం చెయ్యరు"

"మందులో మోసం చేస్తాను కదూ"

"ఏc...."

"మరి నీ దగ్గరకు రావడం, ఆ అమ్మాయిని మోసం చేసినట్లేగా"

"ఇది మనకి మామూలేగా సార్!... మీరేదో పురాణ పురుషుల్లా మాట్లాడుతున్నారు..."

"సరే! నువ్వు లెగు".... అన్నాను.

"అబ్బా! తొందర" అని లేచి లంగా బొందు విప్పబోయింది.

"విప్పకు రజనీ" అన్నాను.

రజని ఆశ్చర్యంగా చూస్తుంది. నేను మంచం దిగి చెప్పులు వేసుకున్నాను.

"వెళ్ళిపోతున్నారా"

"ఆc.."

"ఇంత రాత్రి వచ్చి, నా నిద్ర పాడు చేసి, ఏం చేయకుండా వెళ్ళిపోతే నేనూరుకుంటానా!"

"సారీ రజనీ! ఏదో ఉద్రేకంలో వచ్చాను. ఇదిగో నువ్వడిగిన రెండొందలు."

"డబ్బు నాకెందుకు సార్! మీకు నేనేమిచ్చానని తీసుకుంటాను"

"నిన్ననవసరంగా చికాకు పెట్టాను! ఉంచుకో"

"అవసరం లేదు రంగబాబుగారు! నాక్కావలసింది ఇవ్వగలిగితే ఇవ్వండి" అంది, నా ఎదురుగా నిలబడి.

డబ్బు బెడ్ మీదుంచి, మాట్లాడకుండా, ముందు రూమ్‌లో కొచ్చాను. రజని పరిగెత్తుకుంటూ వచ్చి, డబ్బు జేబులో పెట్టి "వెళ్ళండి" అంది.

వెనక్కి తిరిగి చూడకుండా తూలుకుంటూ రోడ్డు మీద అడుగు పెట్టాను. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. అప్పుడప్పుడు కుక్కలు మొరుగుతున్నాయి. రజనిని - ఏ విధంగానన్నా బాధ పెట్టానా? పెట్టి ఉంటాను! అంతలో జయ ముఖం నవ్వుతూ నా కళ్ళముందు మెదిలింది. మనసు చాలా తేలిక పడింది. తాత్కాలికమైన ఉద్రేకంలో నేను తప్పు చెయ్యలేదు. ఈ వయస్సులో అమ్మాయిలతో తిరగడం కొంతమంది ఉద్దేశ్యంలో తప్పుకాకపోవచ్చు. ఎవరి ఉద్దేశాలు వాళ్ళకుంటాయి. నా ఉద్దేశంలో నేను తప్పు చేయలేదు.

❋❋❋

-తరువాయి భాగం వచ్చే సంచికలో-

## నవ్వితే నవ్వండి

మేనేజరు ప్యూనుని

"ఒకవేళ నువ్వు నా సీట్లోకి మేనేజర్ గా వచ్చి నేను నీ స్థానంలో ప్యూను నైతే నువ్వు చేసే మొట్ట మొదటి పనేమిటి?" అని అడిగాడు.

"ప్యూను ను మార్చేస్తాను" అన్నాడా ముందు చూపున్న ప్యూను!